సాక్షి విశాఖపట్నం

బుధవారం । 18 । డిసెంబర్ । 2024



వెనుదిరిగిన విమానాలు
వాతావరణం అనుకూలించకపోవడంతో మూడు విమానాలు విశాఖలో ల్యాండ్ కాకుండానే వెనుదిరిగాయి. 8లో



నగరంలో చిరు జల్లులు 8లో
నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నగరంలో చిరు జల్లులు కురిశాయి. దీంతో చలితీవ్రత పెరిగింది.



డైట్ దయనీయం
భీమునిపట్నంలోని డైట్ కేంద్రం సమస్యలతో సతమతమవుతోంది. అధ్యాపకుల కొరతతో నాణ్యమైన బోధన కరువైంది. 8లో

తీరంలో ఇసుక తుపాను

సముద్రపు ఇసుకను కొల్లగొట్టేస్తూ ఆదాయార్జన

భీమిలి తీరంలో కూటమి నేతల బరితెగింపు

నదులు, వాగుల్లోని ఇసుకనే కాదు.. అధికార టీడీపీ కూటమి నేతలు ఇప్పుడు సముద్ర తీరంలోని ఇసుకనూ కొల్లగొట్టేస్తున్నారు. ఖనిజాన్వేషణ కోసం ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నారు. రాత్రికి రాత్రి రాష్ట్ర సరిహద్దులు దాటించేస్తున్నారు. ఫలితంగా సముద్ర తీరంలో కందకాలు ఏర్పడుతున్నాయి. ఇలా సాగర తీరాన్ని చెరువులుగా మార్చేస్తూ.. మత్స్యసంపదకు, ప్రకృతికి విఘాతం కలిగిస్తున్నా.. అధికారులు చోద్యం చూస్తున్నారు. భీమిలి తీరం ఈ అరాచకానికి కేంద్రంగా మారింది.

- ఖనిజాల కోసం రాత్రి పూట అక్రమంగా రాష్ట్రం దాటిపోతున్న ఇసుక
- కందకాలుగా మారిపోతున్న సాగర తీరం
- సీ బెడ్‌కు మీటరు లోతులోనే ఖనిజ నిక్షేపాలు
- రెండు మీటర్లకు పైగా తవ్వకాలు చేస్తున్న ఇసుక దొంగలు
- గార్నెట్, జిర్కోనియం, సిలిమినైట్ వంటి ఖనిజాల కోసమే దోపిడీ
- ఫిర్యాదులొస్తున్నా చోద్యం చూస్తున్న అధికారులు


మంగమారిపేట బీచ్‌లో ఏర్పడిన గోతులు

సాక్షి, విశాఖపట్నం: భీమిలి తీరంలో అరుదైన ఖనిజ నిక్షేపాలుండటంతో అక్రమ తవ్వకాలు పెచ్చరిల్లుతున్నాయి. ఇక్కడ బీచ్ రోడ్డు వెంబడి తిమ్మాపురం, మంగమారిపేట, ఉప్పాడ తీర ప్రాంతంలో రాత్రి సమయాల్లో కొందరు లారీలు, మినీ వ్యాన్‌ల ద్వారా ఇసుకను తవ్వి అక్రమంగా తరలించేస్తున్నారు. ఫలితంగా పెద్దపెద్ద గోతులు ఏర్పడుతూ తీరప్రాంత భద్రతని కలవరపెడుతోంది. ఇప్పటికే తుపాను సమయాల్లో రుషికొండ, ఐటీ జంక్షన్, సాగర్‌నగర్, తిమ్మాపురం, మంగమారిపేట, ఉప్పాడ తీర ప్రాంతాల్లో సముద్రం పెద్దఎత్తున కోతకు గురవుతోంది. ఇప్పుడు కూటమి నేతల ఇసుక దందాతో 2–3 మీటర్ల మేర భారీ గోతులు దర్శనమిస్తున్నాయి. ఈ తరహా గోతులతో ఆటుపోట్ల సమయంలో తీరం కోతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది.

అత్యంత అరుదైన ఖనిజ నిక్షేపాలివి..

భీమిలి తీరంలో లభ్యమయ్యే ఖనిజాలు అత్యంత అరుదైనవని జీఎస్ఐ భావిస్తోంది. ఇక్కడ లభ్యమయ్యే గార్నెట్ నిక్షేపాలను శాండ్ బ్లాస్టింగ్, వాటర్ జెట్ కటింగ్, వాటర్ ట్రీట్‌మెంట్ కోసం వినియోగిస్తారు. ఇలిమినేట్, రూటిల్, లికాక్సీన్ వంటి మినరల్స్‌ను సింథటిక్ రూటిల్స్, టైటానియం డైయాక్సైడ్ పిగ్మెంట్, టైటానియం స్పాంజ్, టైటానియం టెట్రాక్లోరైడ్, టైటానియం మెటల్ తయారీకి వినియోగిస్తారు. అత్యంత అరుదుగా లభించే టైటానియం మెటల్స్‌ను ఎయిర్‌క్రాఫ్ట్స్ స్పేస్ షటిల్స్, వైద్య పరికరాల తయారీలో వినియోగిస్తుంటారు. ఇందుకోసమే ఎక్కువ లోతులో ఇసుకని తవ్వి చెన్నై, కేరళకు అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది.


ఉప్పాడ తీరంలో విధ్వంసం

మాకేం తెలీదు.. మేమేం చూడలేదు?

ఇక కూటమి నేతలు సముద్ర తీరాన్ని విధ్వంసం చేస్తూ.. భారీ గుంతలు తవ్వుతూ ఇసుకను దోచేస్తున్నా అధికారులు మాత్రం అలాంటివేమీ జరగడం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అక్రమ రవాణా కోసం ప్రత్యేకంగా రోడ్డు మార్గాన్ని ఏర్పాటుచేసుకున్నా పట్టించుకోవడంలేదు. సీఆర్‌జెడ్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకపోయినా.. టన్నుల కొద్దీ ఇసుక తరలిపోతుండటంతో మత్స్య సంపదకు విఘాతం కలుగుతోందని స్థానికులు భీమిలి డివిజన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అవన్నీ తీరంలోనే కప్పేస్తున్నారు తప్ప.. అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు మాత్రం అడుగు ముందుకెయ్యడంలేదు. పైగా.. కూటమి నేతల ఇసుక దాహాన్ని కప్పిపుచ్చే విషయంలో మాత్రం జిల్లా రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు ఎంతో సమన్వయం పాటిస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి.

అపారమైన ఖనిజ నిక్షేపాలే కారణం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నిర్మాణ రంగాన్ని ఇసుక కొరత వేధిస్తోంది. దీంతో సముద్రంలో దొరుకుతున్న ఇసుకని ఇంటి నిర్మాణ పనులకు వాడుతున్నామంటూ తప్పుదోవ పట్టించి విచ్చలవిడిగా తోడేస్తూ రాత్రికి రాత్రి రాష్ట్రాలు దాటించేస్తున్నారు. నిజానికి.. సముద్రపు ఇసుక ఇంటి నిర్మాణానికి వినియోగించేది చాలా అరుదు. కానీ.. ఇందులో అపారమైన ఖనిజ నిక్షేపాలు దాగి ఉండడంతో వీటి కోసమే ఈ తవ్వకాలు చేపడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భీమిలి తీర ప్రాంతంలో 24 రకాల ఖనిజ నిక్షేపాలతో కూడిన బ్లాకులున్నాయని గతంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ప్రకటించింది. ఇటీవల తీరంలో ఇసుక నల్లగా కనిపించడం కూడా దీనిని బలపరుస్తోంది. ఇదే ఇప్పుడు కూటమి నేతల పాలిట వరంగా మారింది. ఇక్కడి ఇసుకలో ప్రధానంగా గార్నెట్, జిర్కోనియం, ఇలిమినైట్, సిలిమినైట్, రూటిల్, లికాక్సీన్, మోనోజైట్ వంటి మినరల్స్ ఉన్నట్లుగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భీమిలిలోని 24 బ్లాకుల్లో సుమారు 4.302 మిలియన్ టన్నుల భారలోహాలున్నాయి. సీ బెడ్‌కు కేవలం ఒక మీటరు లోతు నుంచే ఈ ఖనిజ నిక్షేపాలున్నాయని తెలుస్తోంది. అందుకే ఖనిజ నిక్షేపాల కోసం ఇసుక తవ్వకాలు జరుపుతూ రూ.కోట్ల లావాదేవీలు చేతులు మారుతున్నట్లు సమాచారం.

పెద్ద పెద్ద లారీల ద్వారా తరలిస్తున్నారు..



తీర ప్రాంతాల్లో సముద్రపు ఇసుకను అడ్డగోలుగా తవ్వేస్తూ తరలించేస్తున్నారు. ఫలితంగా పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. ఇది తీరప్రాంత భద్రతకు ముప్పు కలిగించడమే. ఈ గోతులు చూస్తుంటే సముద్రం ఎప్పుడు ముందుకొచ్చేస్తుందోనని మా ప్రాంత ప్రజలంతా భయపడుతున్నాం. పెద్ద పెద్ద లారీల ద్వారా ప్రతిరోజూ ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు.

– వేముల ఈశ్వర్‌రెడ్డి, కాపులుప్పాడ

చేపలు దొరకడంలేదు



ఇప్పటికే గంగమ్మ తల్లి ముందుకొచ్చేస్తూ భయపెడుతోంది. ఇలాంటి ప్రాంతంలో ఇసుక దోచేస్తుండటం మాకు భయం కలిగిస్తోంది. ఇసుక లేకపోతే అలల రాకపోకల్లో వ్యత్యాసం కనిపిస్తుంది. దీనివల్ల.. ఇటువైపు చేపల రాక ఆగిపోతుంది. అక్రమ తవ్వకాలు జరిగినప్పటి నుంచి ఈ ప్రాంతాల్లో వేటకు వెళ్తుంటే చేపలు సరిగా దొరకడంలేదు. ఇదే రీతిలో అక్రమ రవాణా కొనసాగితే చిన్న చేప కూడా పట్టుకోలేం.

–ఎం.చిన్నారావు, మత్స్యకారుడు, మంగమారిపేట

తీర భద్రతకు పెనుముప్పు..



సముద్రపు ఇసుకను అక్రమంగా తరలించడం తీర ప్రాంత ప్రజలకు భవిష్యత్తులో ప్రమాదకరం. బీచ్ రోడ్డు ప్రధాన రహదారి వెంబడి యథేచ్ఛగా ఇసుకను రవాణా చేస్తున్నా అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడ అనేక సీసీ కెమెరాలున్నాయి. ఇసుక తరలింపుపై దృష్టిపెట్టి అధికారులు చర్యలు తీసుకుంటే అక్రమ రవాణాకు అడ్డుకట్ట వెయ్యొచ్చు.

– దౌలపల్లి కొండబాబు, 4వ వార్డు కార్పొరేటర్

రెవెన్యూ రాజకీయ సదస్సా?

అధికారులకు కుర్చీల్లేకుండా కూర్చున్న కూటమి నేతలు

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల అనుచరులతో నిండిపోయిన కలెక్టరేట్
- సమస్యలు తెలిపేందుకు ఇబ్బందిపడిన రెవెన్యూ అధికారులు
- సదస్సుకు దూరంగా ఎమ్మెల్యే గంటా


వెనుక వరుసలో కూర్చున్న కూటమి పార్టీల ద్వితీయ శ్రేణి నేతలు

సాక్షి, విశాఖపట్నం: జరిగిందేమో ఉత్తరాంధ్ర జిల్లాల రెవెన్యూ సదస్సు.. సమావేశ మందిరంలో కనిపించిందేమో కూటమి పార్టీల దిగువస్థాయి నేతలు. అధికారులు కూర్చునేందుకు చోటు లేకపోయినా.. మేం బయటికి వెళ్లం.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటే మేమూ అంటూ సదస్సు ఆద్యంతం ఉన్నారు. తామంతా రెవెన్యూ సదస్సుకు వచ్చామా.? కూటమి నేతల రాజకీయ సదస్సుకు వచ్చామా అనే సందేహంతోనే రెవెన్యూ అధికారులు రోజంతా కాన్ఫరెన్స్‌లో సర్దుకొని కూర్చున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్‌డీవోలతో కలెక్టరేట్ సమావేశమందిరంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం రీజనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ పరిధిలో సమస్యలు పరిష్కారం, భూముల రీ సర్వే, 22ఏ, ఫ్రీ హోల్డ్, గ్రామ సభలు, పీజీఆర్ఎస్.. తదితర అంశాలపై సమీక్షలో చర్చించారు. ఈ సదస్సుకు మంత్రులు, అధికారులతో పాటు ఆయా జిల్లాల ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు మాత్రమే పాల్గొనే అవకాశం ఉంది. ఇంకెవరూ ఆ సదస్సులో ఉండటానికి అర్హులు కారు. కానీ.. కాన్ఫరెన్స్‌లో అధికారులకు సైతం చోటు లేకుండా.. కూటమి పార్టీల నేతలతో హాల్ నిండిపోయింది. ఒకానొక సమయంలో ఆర్డీవోలకు చోటు లేకపోవడంతో.. మళ్లీ కుర్చీలు తెచ్చి సర్దుకోవాల్సి వచ్చింది.

ఇంత జరుగుతున్నా.. తమ అనుచరుల్ని బయటకు వెళ్లాలని మంత్రులు గానీ, ఎమ్మెల్యేలు గానీ చెప్పలేదు. సమావేశానికి ఆహ్వానం లేని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, నామినేటెడ్ పోస్టు హోదాలో ఉన్న సీతంరాజు సుధాకర్, జనసేన చోటా నాయకుడు చంద్రరావు, బీజేపీ నేత శ్రీరామమూర్తి.. ఇలా దిగువ స్థాయి నేతలంతా హాల్‌లోనే ఆద్యంతం ఉన్నారు. ఎమ్మెల్యేలు తమ పరిధిలో ఉన్న వ్యవహారాలపై మాట్లాడుతుంటే.. చోటా నాయకులు మధ్యలో కలగజేసుకొని మాట్లాడుతుండటంతో అధికారులు అసహనం వ్యక్తం చేశారు. తమ పరిధిలో కూటమి నేతల వల్ల ఎదురవుతున్న సమస్యలు మంత్రి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా దృష్టికి తీసుకెళ్లాలని భావించినా.. జిల్లా, మండల స్థాయి నాయకులు సదస్సులో ఉండటంతో.. వారి వ్యవహారాలు బయటపెట్టేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొత్తంగా రెవెన్యూ సదస్సును కూటమి నేతలు రాజకీయ సదస్సుగా మార్చేశారు. ఇదిలా ఉండగా.. కీలకమైన సదస్సుకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు డుమ్మా కొట్టారు. రెవెన్యూ విభాగంలో తన మాట చెల్లుబాటు కాకపోవడంతోనే గంటా గైర్హాజరైనట్లు కూటమి నేతలే చెబుతుండటం కొసమెరుపు.

సీసీఎల్‌ఏపై వెలగపూడి చిందులు

- ఐఏఎస్‌పై పేపర్లు విసిరేసిన ఎమ్మెల్యే
- కన్నీటి పర్యంతమైన మహిళా ఉన్నతాధికారి?

సాక్షి, విశాఖపట్నం: ఐఏఎస్ అధికారులంటే కూటమి ఎమ్మెల్యేలకు ఎంత చిన్నచూపో మరోసారి నిరూపితమైంది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సులో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చిందులు తొక్కారు. సమావేశం ముగిసిన తర్వాత వినతులపై చర్చించారు. ఈ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి అనుచరుడు తమకు కేటాయించిన భూమి 22ఏ పరిధిలో ఉందని వినతి పత్రం అందించారు. దీనిపై స్పందించిన సీసీఎల్‌ఏ జయలక్ష్మి, 'మధ్యాహ్నం కూడా మీరు ఇదే సమస్య చెప్పారు. దానిని సంబంధిత అధికారులకు పంపించి చర్యలు తీసుకోమని కూడా చెప్పాను. పదే పదే ఎందుకు అడుగుతున్నారు?' అని అన్నారు. దీంతో పక్కనే ఉన్న ఎమ్మెల్యే వెలగపూడి శివాలెత్తిపోయారు. 'మర్యాదగా మాట్లాడాలి కదా? ఎందుకలా మాట్లాడుతున్నారు?' అంటూ ఆమెపై మండిపడ్డారు. దీనిపై ఆ మహిళా ఉన్నతాధికారి స్పందిస్తూ.. 'కాదు ఎమ్మెల్యే గారు, మధ్యాహ్నం వినతి పత్రం తీసుకున్నప్పుడు, దానిపై చర్యలు తీసుకుంటానని చెప్పాను' అని అన్నారు. అయినా వెలగపూడి శాంతించలేదు. 'మీ ప్రభుత్వ అధికారులు ఇలాగే వ్యవహరిస్తారు. సరిగా మాట్లాడటం కూడా రాదు. మీలాంటి వారి వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోంది' అంటూ కేకలు వేస్తూ హడావుడి చేశారు. దీనిపై సీసీఎల్‌ఏ వెలగపూడితో మాట్లాడేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఆయన అరుపులు, కేకలు వేస్తూ చేతిలో ఉన్న కాగితాలను ఆమెతోపాటు అధికారులపైకి విసిరేశారు. 'సమస్యలపై స్పందించనప్పుడు రెవెన్యూ సదస్సులకు ఎమ్మెల్యేలను ఎందుకు పిలుస్తారు?' అంటూ కేకలు వేసుకుని బయటకు వెళ్లిపోయారు. ఇందులో ఆమె తప్పేమీ లేకున్నా, అందరి ముందు ఆమెతో అమర్యాదగా వ్యవహరించడంతో సీసీఎల్‌ఏ కన్నీటి పర్యంతమయ్యారని తెలుస్తోంది.

కేసులు 73 | రికవరీ రూ.89.33 లక్షలు

- 87 మంది నేరగాళ్ల అరెస్ట్
- 1.1 కిలోల బంగారం, 4.61 కిలోల వెండి స్వాధీనం
- రూ.3.5 లక్షల నగదు, 25 బైక్‌లు, ఒక ఆటో, కార్, 305 సెల్‌ఫోన్ల రికవరీ
- రికవరీ మేళాలో బాధితులకు అందజేత


రికవరీ చేసిన ఆభరణాలను బాధితుడికి అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నేర రహిత సమాజం కష్టమని.. కానీ నేరాల నియంత్రణ, నిందితులను పట్టుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. పోలీస్ సమావేశ మందిరంలో మంగళవారం రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్‌లో నగరంలో 73 చోరీ కేసులను ఛేదించి 87 మంది నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరి నుంచి రూ.45,83,385 విలువ చేసే బంగారం, వెండి, నగదు, బైక్‌లు, కార్, ఆటో, ల్యాప్‌టాప్, ప్రింటర్‌లను, రూ.43.5 లక్షలు విలువ చేసే 290 సెల్‌ఫోన్లను మొత్తంగా రూ.89,33,385 విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.


బైక్‌ను బాధితుడికి అందజేస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

ఇందులో 1.1 కిలోల బంగారం, 4.61 కిలోల వెండి, రూ.3,50,820 నగదు, 21 బైక్‌లు, ఒక ఆటో, కార్, ప్రింటర్, 2 ల్యాప్‌టాప్‌లు ఉన్నాయి. నేరాల నియంత్రణ కోసం నగరంలో ప్రజలు, వ్యాపారుల భాగస్వామ్యంతో 8 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే వీధుల్లో లైటింగ్ ఏర్పాటు, పెట్రోలింగ్ పార్టీలు, బీట్ సర్వీస్ పెంచడం, పొదలు లేకుండా చేయడంతో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గుతోందన్నారు. ఫలితంగా ప్రతి నెలా కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టడంతో పాటు కేసుల ఛేదనలో కూడా పురోగతి ఉన్నట్లు వివరించారు. నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి చేపడుతున్న చర్యలు కూడా సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. త్వరలో గేటెడ్ కమ్యూనిటీలతో సమావేశం ఏర్పాటు చేసి నేరాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. కేసులను ఛేదించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి, నగదు, సెల్‌ఫోన్లు, బైక్‌లు, ఇతర సామగ్రిని బాధితులకు అందజేశారు. సమావేశంలో డీసీపీ(క్రైం) లతా మాధురి, ఏడీసీపీ(క్రైం) మోహనరావు, ఏసీపీ (క్రైం) లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



కిక్కే కిక్కు

బార్లా తెరిచారు..

- కొత్తగా మరో 8 బార్లు, 2 ప్రీమియం స్టోర్లకు నోటిఫికేషన్
- వ్యాపారాలు లేక తలలు పట్టుకుంటున్న వైన్‌షాప్, బార్ల నిర్వాహకులు
- వైన్‌షాపులకు 12 శాతానికి మించి రాని కమీషన్
- బార్లకు తగ్గిన వ్యాపారం.. నిర్వహణ భారంతో సతమతం

విశాఖ సిటీ: మద్యం విక్రయాల ద్వారా వచ్చే సొమ్ము ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ఈ నేపథ్యంలో వీలైనంత ఎక్కువ ఆదాయం పొందేందుకు ప్రభుత్వం మరిన్ని బార్లు, లిక్కర్ షాపుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. తాజాగా జిల్లాలో 8 బార్లకు, 2 ప్రీమియం లిక్కర్ స్టోర్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చింది. దరఖాస్తులు, లైసెన్సులతో పాటు మద్యం విక్రయాల ద్వారా ఖజానా నింపుకోవాలని భావిస్తోంది. లిక్కర్‌పై కమీషన్ సరిపోక వైన్‌షాప్, బార్ల నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. ఖజానా నింపుకోవడానికి ఇప్పుడు మరిన్ని బార్లు ఏర్పాటు చేసి ప్రభుత్వం తమను బలిచేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిమితికి మించి బార్లు

జిల్లాలో బార్ల సంఖ్య ఇప్పటికే పరిమితికి మించి ఉంది. ప్రస్తుతం విశాఖలో 127 బార్లు ఉన్నాయి. గతంలో ప్రభుత్వమే లిక్కర్ షాపులు నిర్వహించింది. తొలుత రాత్రి 8 గంటలకే ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసివేయడంతో ఆ తరువాత బార్లకు మంచి వ్యాపారం జరిగేది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గతంలో కంటే ఎక్కువగా ప్రైవేటు మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించింది. వీటి ద్వారా రాత్రి 10 గంటల వరకు విక్రయాలకు అనుమతులు ఇచ్చారు. దీంతో బార్ల వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. చాలా మంది బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు వ్యాపారాన్ని లీజుకు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఇప్పటికే 20 వరకు బార్లు అధికంగా ఉండగా.. తాజాగా మరో 8 బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రూ.కోట్లను ఆర్జించాలని చూస్తోంది. ఉన్న బార్లకే వ్యాపారం లేకపోగా కొత్తగా బార్లకు అనుమతులు ఇస్తుండడం పట్ల ప్రస్తుత బార్ల నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తగా రెండు ప్రీమియం లిక్కర్ స్టోర్లు

జిల్లాలో 155 వైన్‌షాపులను లాటరీ ద్వారా కేటాయించారు. ఇప్పుడు కొత్తగా రెండు ప్రీమియం లిక్కర్ స్టోర్ల ఏర్పాటుకు ప్రభుత్వం మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతమున్న వైన్‌షాపులకే అంతంత మాత్రంగా వ్యాపారం జరుగుతోంది. ప్రధానంగా దరఖాస్తు సమయంలో వ్యాపారులకు కమీషన్ 20 శాతం ఉంటుందని ప్రకటించిన కూటమి ప్రభుత్వం.. ఆ తరువాత మాత్రం విచిత్రమైన పన్నుల రూపంలో 7 నుంచి 8 శాతం మేర కమీషన్‌లో కోత పెట్టింది. మద్యం వ్యాపారం ద్వారా రూ.కోట్లు సంపాదించవచ్చని కొండంత ఆశతో రూ.లక్షలు, రూ.కోట్లు ఖర్చు చేసి పదుల సంఖ్యలో దరఖాస్తులు చేసి మరీ మద్యం షాపులు దక్కించుకున్న వారికి ఇప్పుడు.. 12 శాతానికి మించి కమీషన్ రావడం లేదు. దీంతో నిర్వహణ భారంతో నిర్వాహకులు సతమతమవుతున్నారు. ఫలితంగా ఏ రోజుకు ఆ రోజు మద్యం విడిపించుకుంటూ విక్రయాలు చేస్తున్నారు.

ప్రీమియం సేల్స్ కష్టమే..

ప్రీమియం లిక్కర్ స్టోర్‌కు దరఖాస్తుదారుడు నాన్ రిఫండబుల్‌గా రూ.15 లక్షలు డీడీ ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే స్టోర్ దక్కించుకున్న వారు లైసెన్సు కింద రూ.కోటి చెల్లించాలి. లైసెన్సు వచ్చిన తరువాత 4 వేల చదరపు అడుగుల్లో స్టోర్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఇందులో రూ.1200లకు పైగా లిక్కర్, రూ.400 పైగా ఉన్న బీర్లను మాత్రమే విక్రయించాల్సి ఉంటుంది. మద్యం ఏరులా పారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రీమియం లిక్కర్ సేల్స్ కష్టమన్న భావన వ్యాపార వర్గాల్లో నెలకొంది.



డైట్ దయనీయం

భావి భారత నిర్మాణానికి పునాదులు వారు. బడుల్లో జ్ఞాన బీజం నాటి.. దేశ పురోగతిలో కీలక పాత్ర పోషించే అనుసంధాన కర్తలు వారు. దిగజారుతున్న మానవీయ విలువలకు.. జీవమిచ్చే సామాజిక సంస్కర్తలు వారు. రేపటి సమాజంలో భావి పౌరుల భవితవ్యాన్ని భుజాలపై మోసే శ్రామికులు వారు. వీరే బోధన మార్గాన్ని వృత్తిగా ఎంచుకున్న ఛాత్రోపాధ్యాయులు. వీరికి శిథిలావస్థలో ఉన్న భవనమే దిక్కయింది. అధ్యాపకుల కొరతతో నాణ్యమైన బోధన కరువైంది.

- రెగ్యులర్ అధ్యాపకులు లేక ఇక్కట్లు
- మొత్తం 23 పోస్టులకు ఇద్దరే రెగ్యులర్
- డిప్యూటేషన్‌పై 7గురు బోధనా సిబ్బంది
- ఇబ్బందుల్లో ఛాత్రోపాధ్యాయుల శిక్షణ
- శిథిల భవనాలతో భయం భయం
- స్కాలర్‌షిప్ అందక భారమైన హాస్టల్ నిర్వహణ


పిచ్చి మొక్కల మధ్య విద్యార్థినుల వసతి గృహం


వసతి గృహం పక్కనే పాడుబడిన భవనం


వేడినీళ్ల కోసమని విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న కట్టెల పొయ్యిలు

విశాఖ విద్య: భీమునిపట్నం కేంద్రంగా ఉన్న ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ సమస్యలతో కూనారిల్లుతోంది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే డైట్ కాలేజీ ఇదొక్కటే. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాలకు చెందిన విద్యార్థులకు ఇక్కడ అడ్మిషన్లు ఇస్తున్నారు. రెండేళ్ల వ్యవధితో కూడిన డిప్లొమో ఇన్ ఎడ్యుకేషన్(డీఎడ్) శిక్షణకు ఒకప్పుడు యమ డిమాండ్ ఉండేది. కానీ ఇప్పుడా ఆ పరిస్థితి లేదు. ఏటా వంద మందిని చేర్చుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రస్తుతం ఇక్కడ సీట్లు నిండని పరిస్థితి. 2024–25 విద్యా సంవత్సరంలో ఫస్టియర్ 68 మంది, సెకండియర్ 63 మంది శిక్షణ పొందుతున్నారు. డైట్ కాలేజీ నిర్వహణపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించకపోవటంతో భావి ఉపాధ్యాయులు సమస్యల నడుమ శిక్షణ పొందాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి.

అధ్యాపకులు లేకుండా శిక్షణ ఎలా..

డైట్ కాలేజీలో ఏడుగురు సీనియర్ లెక్చరర్లకు ప్రస్తుతం ఇద్దరే ఉన్నారు. మొత్తం 16 లెక్చరర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. దీంతో పాఠ్యాంశాల బోధన, విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు స్కూళ్ల నుంచి ఆరుగురు స్కూల్ అసిస్టెంట్లు, ఒక హెచ్‌ఎంను డిప్యూటేషన్(ఫారిన్ సర్వీసు)పై ఇక్కడ నియమించారు. ఇలా పనిచేస్తున్న హెచ్‌ఎంకు ఇటీవల చంద్రపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇలాంటి పరిణామాలతో డైట్ కాలేజీలో సరిపడా అధ్యాపకులు లేక, ఉపాధ్యాయ శిక్షణ సవ్యంగా సాగటం లేదు.

క్షణక్షణం.. భయం భయం

డైట్ కాలేజీకి అనుబంధంగా ఉన్న వసతి గృహంలో 31 మంది విద్యార్థినులు, 16 మంది విద్యార్థులు ఉంటున్నారు. కాలేజీకి కిలోమీటర్ దూరంలో బీచ్ రోడ్‌లో ఉన్న ఈ హాస్టల్ భవనం బూత్ బంగ్లాను తలపిస్తోంది. చిన్న పాటి వర్షానికే నీరు కారిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లోనే గత నెల 14న రాత్రి వేళ షార్ట్ సర్క్యూట్‌తో భవనంలో మంటలు వ్యాపించాయి. హాస్టల్‌కు పక్కనే పాడుబడిన భవనం ఉంది. చుట్టూ ముళ్ల పొదలతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ఛాత్రోపాధ్యాయులు భయాందోళనలు చెందుతున్నారు. బాలబాలికలకు ఇద్దరికీ ఒకే చోట హాస్టల్ ఏర్పాటు చేయటం కూడా కొంత ఇబ్బందికరంగా ఉంది.

స్వయంపాలిత కష్టాలు

కాలేజీ హాస్టల్‌ను ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులే నిర్వహించుకోవాలి. స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్(ఎస్‌ఎంహెచ్) కావడంతో నిర్వహణ వీరికి భారమవుతుంది. 2023–24 విద్యా సంవత్సరం స్కాలర్‌షిప్పులను కూటమి ప్రభుత్వం నేటికీ మంజూరు చేయలేదు. ఈ ఏడాది ఉపకార వేతనాల ఊసే లేదు. ప్రభుత్వ కాలేజీనే అయినా తమకేంటి ఈ కష్టాలని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్కాలర్‌షిప్ రాక ఇబ్బందులు



నేను డైట్ సెకండియర్ చదువుతున్నాను. ఇప్పటివరకు స్కాలర్‌షిప్ మంజూరు కాలేదు. దీంతో ఇంటి దగ్గర నుంచి తెచ్చుకున్న డబ్బులతోనే హాస్టల్ నిర్వహించుకుంటున్నాం. దీని వల్ల కొంత ఇబ్బందికరంగానే ఉంది.

– ఎస్.లలిత, ఛాత్రోపాధ్యాయురాలు

సౌకర్యాలు కల్పిస్తే మేలు



హాస్టల్‌లో సరైన సౌకర్యాలు లేవు. వర్షం పడితే భవనం నుంచి నీరు కారిపోతుంది. చుట్టూ ముళ్ల పొదలు ఉన్నాయి. స్కాలర్‌షిప్ మంజూరుకాకపోవడంతో హాస్టల్ నిర్వహణ చాలా కష్టంగా ఉంది.

– కె.సమీర, ఛాత్రోపాధ్యాయురాలు

ఉన్నతాధికారులకు నివేదించాం

ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో అధ్యాపకుల కొరత ఉన్న మాట వాస్తవమే. ఛాత్రోపాధ్యాయుల శిక్షణకు ఆటంకం లేకుండా డిప్యూటేషన్‌పై వచ్చిన వారితో బోధన సాగిస్తున్నాం. డైట్ కాలేజీ పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే ఖాళీ పోస్టుల భర్తీ అయ్యే అవకాశం ఉంది.

– ఎం.జ్యోతికుమారి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డైట్ కాలేజీ

కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి పర్యటన నేడు

మహారాణిపేట: కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ బుధవారం నగరంలో పర్యటిస్తారు. ఉదయం 9 గంటలకు తూర్పు నావికాదళంలో ఐఎన్‌ఎస్ నిర్దేశక్ నౌకను జాతికి అంకితం చేస్తారు. అనంతరం హిందూస్తాన్ షిప్‌యార్డ్‌ను సందర్శిస్తారు. అక్కడ నుంచి కోస్ట్‌గార్డ్‌ను సందర్శించి.. రాత్రి 9 గంటలకు విమానంలో ఢిల్లీ బయలుదేరుతారు.

ముగ్గురు సీఐలకు స్థానచలనం

విశాఖ సిటీ : నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లకు స్థాన చలనం కలిగింది. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ రేంజ్ నుంచి వచ్చిన టి.కామేశ్వరరావుకు న్యూపోర్ట్ లా అండ్ ఆర్డర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న జి.దాలిబాబును సీసీఎస్–1కు బదిలీ చేశారు. సీసీఎస్–1లో ఉన్న వి.రమేష్‌ను విశాఖ రేంజ్‌కు సరెండర్ చేశారు.

నిలిచిన బోటు షికారు

కొమ్మాది: అల్పపీడనం కారణంగా రుషికొండ బీచ్‌లో ఏపీ టూరిజం స్పీడ్ బోటును నిలిపివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వాతావరణం అనుకూలించిన తర్వాత బోటు షికారు ప్రారంభిస్తామన్నారు.

రేపు రైతు బజార్ల స్టాళ్లకు డ్రా

మహారాణిపేట: జిల్లాలోని రైతు బజార్లలో డ్వాక్రా, ఇతర స్టాళ్లకు అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు ఈనెల 19న సాయంత్రం 4 గంటలకు డ్రా తీయనున్నట్లు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. మొత్తం 30 స్టాళ్లకు కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో డ్రా ఉంటుందన్నారు.

నగరంలో చిరుజల్లులు

సాక్షి, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం విశాఖని వణికిస్తోంది. ఓవైపు చలి తీవ్రత పెరగడంతో గజగజలాడుతున్న జిల్లా.. ఇప్పుడు వర్షం కురుస్తుండటంతో శీతల గాలులు మరింత పెరిగాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి వర్షం ప్రారంభమైంది. నగరంలో అనేక చోట్ల సుమారు 10 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మరోవైపు వర్షాల కారణంగా ఉష్ణోగ్రతలు కూడా తగ్గుముఖం పట్టాయి. నగరంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 18 నుంచి 19 డిగ్రీల మధ్యలో కొనసాగుతున్నాయి. ఈ నెల 22 వరకు వర్షాలు కురిసే సూచనలున్నాయని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు.

భద్రతలో కోస్ట్ గార్డ్, నేవీ పరస్పర సహకారం

సాక్షి, విశాఖపట్నం : ఇండియన్ నేవీ, ఇండియన్ కోస్ట్ గార్డ్ సంయుక్తంగా 12వ తూర్పు ప్రాంత కమ్యూన్ గార్డ్ సమావేశం విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా, కోస్ట్ గార్డ్ కమాండర్ (తూర్పు సముద్ర తీరం) అడిషనల్ డైరెక్టర్ జనరల్ డోనీ మైఖేల్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. నేవల్, కోస్ట్ గార్డ్ ఉమ్మడి శిక్షణ, కార్యకలాపాలు, కమ్యూనికేషన్ వ్యవస్థ మరింత బలోపేతం చేయడం, సముద్ర భద్రతా విషయంలో పరస్పర సహకారం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే తీరు తదితర అంశాలపై చర్చించారు.

2025లో కార్మికుల సెలవులు

సీతంపేట: వివిధ సంస్థలు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న కార్మికులకు 2025 సంవత్సరానికి వేతనంతో కూడిన పండగలు, జాతీయ సెలవుల క్యాలెండర్‌ను జోన్–1 సంయుక్త కార్మిక కమిషనర్ ఎం.సునీత మంగళవారం ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం 1988, ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీలు, సంస్థల చట్టం 1974 ప్రకారం ఈ సెలవులు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని సంస్థలు, ఫ్యాక్టరీలు ఈ సెలవులను పాటించాలని ఆదేశాలు జారీ చేశారు.

జాతీయ సెలవులు : రిపబ్లిక్ డే, జనవరి 26(ఆదివారం), మే డే, మే 1(గురువారం), స్వాతంత్య్ర దినోత్సవం, ఆగస్టు 15(శుక్రవారం) గాంధీ జయంతి, అక్టోబరు 2 (గురువారం), ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం, నవంబర్ 1 (శనివారం).

పండగ సెలవులు : కనుమ, జనవరి 15 (బుధవారం), మహా శివరాత్రి, ఫిబ్రవరి 26 (బుధవారం) రంజాన్, మార్చి 31 (సోమవారం), క్రిస్మస్, డిసెంబర్ 25 (గురువారం).

వెనుదిరిగిన విమానాలు

మద్దిలపాలెం: వాతావరణం అనుకూలించకపోవడంతో విశాఖ విమానాశ్రయంలో ల్యాండింగ్ కావాల్సిన మూడు విమానాలు వెనుదిరిగాయి. ఇందుకు సంబంధించి విమానాశ్రయ అధికారులు అందించిన వివరాలివీ.. మంగళవారం సాయంత్రం విజయవాడ నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా విమానం విశాఖలో ల్యాండింగ్ కావాల్సి ఉంది. ఈ విమానంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ఉన్నారు. అయితే వాతావరణం అనుకూలించకపోవడంతో అది తిరిగి విజయవాడకు వెళ్లిపోయింది. అలాగే హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఇండిగో విమానం విశాఖ చేరుకున్నా.. వాతావరణం అనుకూలించకపోవడంతో ల్యాండ్ అవ్వకుండానే తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయింది. ఇక ఢిల్లీ నుంచి విశాఖ రావాల్సిన విమానంలో కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి ఉన్నారు. ఇది కూడా విశాఖలో ల్యాండ్ అవ్వడానికి వాతావరణం అనుకూలించకపోవడంతో హైదరాబాద్‌కు పంపించినట్లు విమానయాన శాఖ అధికారులు వెల్లడించారు.

భర్నికంలో 8 మందికి డయేరియా

- వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల్లో చేరుతున్న బాధితులు
- ఫార్మా వ్యర్థ రసాయనాలే కారణమా.?


మొల్లోడుగెడ్డలో నిలిచిన వ్యర్థ జలాలు


బాధితులను పరామర్శిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

పరవాడ: భర్నికంలో డయేరియా సోకి 8 మంది అస్వస్థతకు గురయ్యారు. డయేరియా సోకిన వారిలో గ్రామానికి చెందిన బొండా కాంతం(60), కె.సన్యాసిరాజు(56), బొండా గంగమ్మ(60), కర్రి మోక్షిత్(7), గండిబోయిన పోతురాజు(75), పెంటారావు(45), (నిఖిల్(13), బొండా లక్ష్మి(55) ఉన్నారు. వీరిలో కొందరు ఆదివారం నుంచి వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. మరి కొందరు సోమ, మంగళవారాల్లో వాంతులు, విరేచనాలతో అనారోగ్యానికి లోనయ్యారు. దీంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి, పరవాడ పీహెచ్‌సీ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. గ్రామంలో డయేరియా సోకిన విషయాన్ని తెలుసుకున్న అనకాపల్లి డీఎంహెచ్‌వో బాలాజీ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ ఆస్పత్రికి చెందిన వైద్య నిపుణులు కె.వీరజ్యోతి, చంద్రశేఖర్, వినోద్‌కుమార్, వాడచీపురుపల్లి, పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలందించారు. గ్రామంలో మంచినీటి పథకాలు, బావులు, బోర్ల నుంచి నీటి నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు తరలించారు. ప్రస్తుతం డయేరియా అదుపులో ఉందని, రోగులకు అవసరమైన వైద్య సేవలను అందిస్తున్నట్లు అనకాపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో కేవీ జ్యోతి తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి, ఆర్డీవో షేక్ అయేషాలు గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డయేరియా పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి, బాధితులకు అవసరమైన వైద్య సేవలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆర్డీవో ఆదేశించారు. గ్రామంలో డయేరియా ప్రబలడానికి గ్రామ సమీపంలోని మొల్లోడు గెడ్డలో చాలా కాలం నుంచి నిలిచిన ఫార్మా వ్యర్థ రసాయన జలాలే కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పారిశ్రామికవేత్తలుగా గిరిజన మహిళలు

గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ భార్గవి పిలుపు


వీడీవీకే ఉత్పత్తులు పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవి

కొమ్మాది: వన్‌దన్ వికాస కేంద్రాల (వీడీవీకే) సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెంది, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఎస్. భార్గవి ఆకాంక్షించారు. పాడేరు, పార్వతీపురం, సీతంపేట, కె.ఆర్.పురం ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులు, వెలుగు అధికారులు, జీసీసీ అధికారులకు రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ భవన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. వన్‌దన్ వికాస కేంద్రాల నిర్వహణ, సభ్యులకు అందించిన శిక్షణ, ఉత్పత్తులు, భవననిర్మాణాలు, మౌలిక యంత్ర పరికరాల కొనుగోలుపై సమీక్షించారు. వివిధ వీడీవీకేలు చేస్తున్న ఉత్పత్తులను, మార్కెటింగ్ సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ వీడీవీకేలు బలోపేతం చేయాలని, సేకరించిన అటవీ ఉత్పత్తులకు అదనపు విలువలు జోడించి మంచి బ్రాండింగ్ చేయాలని సూచించారు. విస్తరాకులతో తయారు చేసిన వస్తువులను సింహాచలం, టీటీడీ దేవస్థానాలకు సరఫరా చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో 106 వీడీవీకేలు ఉన్నాయని రూ.3.1 కోట్ల నిధులతో యంత్రపరికరాలు సమకూర్చి, సభ్యులకు శిక్షణ ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో జీసీసీ ఎండీ కల్పనాకుమారి, పీవోలు కట్టా సింహాచలం, అపూర్వ భరత్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల మానవత్వం


గురుంజిని అతని భార్యకు అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ దేముడుబాబు

దాబాగార్డెన్స్: నగర పోలీసులు సక్రమంగా విధులు నిర్వర్తించడంతో పాటు మానవత్వం చాటుకున్నారు. ఆపదలో ఉన్న ఒకరిని ఆదుకున్నారు. వివరాలివీ.. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతానికి చెందిన గురుంజి బెంగళూరులో పని చేస్తున్న తన భార్యను చూసేందుకు ఈ నెల 11న రైలులో బయలుదేరాడు. రైలు విశాఖపట్నం చేరుకోగానే.. ఏదైనా తిందామని రైలు దిగాడు. ఇంతలో అతను ప్రయాణిస్తున్న రైలు వెళ్లిపోయింది. ఆ సమయంలో వేరే రైలు లేకపోవడంతో అతన్ స్టేషన్ నుంచి బయటకు వచ్చాడు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డాడు. చికిత్స కోసం అక్కడి పోలీసులు అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఆ సమయంలో కానిస్టేబుల్ నానాజీ అతని భార్య ఫోన్ నంబర్ సేకరించారు. కాగా.. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురుంజి ఎవరికీ చెప్పకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని పోలీసులు ఆమెకు తెలియజేయడంతో.. ఆమె వెంటనే బెంగళూరు నుంచి విశాఖ చేరుకున్నారు. తన భర్త కోసం పోలీసుల సహాయంతో వెతకడం ప్రారంభించారు. నాలుగు రోజులైన అతని ఆచూకీ లభించలేదు. సోమవారం కొత్తరోడ్డు జంక్షన్‌లో వన్‌టౌన్ పోలీసులు అతన్ని గుర్తించారు. ఆకలితో అలమటిస్తున్న గురుంజికి అన్నం పెట్టారు. కొత్త దుస్తులు కొనిచ్చారు. గురుంజిని వన్‌టౌన్ సీఐ దేముడుబాబు ఆమెకు అప్పగించి.. రైలు టికెట్ ఖర్చులిచ్చి పశ్చిమబెంగాల్ పంపారు. తన భర్తను అప్పగించిన పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఆగని సముద్ర తీరం కోత


వైఎంసీఏ ఎదురుగా కోతకు గురవుతున్న సముద్రతీరం

ఏయూక్యాంపస్: సముద్రతీరంలో కోత ఆగడం లేదు. సాధారణంగా వాతావరణ మార్పులు జరిగిన సమయంలో కోతకు గురవడం, తర్వాత యథాస్థితికి రావడం మనం చూస్తున్నాం. అయితే ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. వైఎంసీఏ ఎదురుగా ఉన్న ప్రాంతం నుంచి కురుసుర సబ్‌మెరైన్ ఉన్న ప్రాంతం వరకు తీరం భారీగా కోతకు గురైంది. గతంలో ఇదే ప్రాంతం కోతకు గురవడంతో అక్కడ నాటిన కొబ్బరి చెట్లకు ముప్పు వాటిల్లింది. కోతను అడ్డుకోవడానికి తీరానికి, కొబ్బరి చెట్లకు మధ్య రాళ్లు వేసి, చుట్టూ ఇనుప మెష్ వేశారు. ప్రస్తుతం కెరటాల ఉధృతికి ఈ రాళ్లు జారిపోయే ప్రమాదం నెలకొంది.

ఆరుగురి మృతి.. డ్రైవర్‌కు పదేళ్ల జైలు

విశాఖ లీగల్: ఆరుగురి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని 12వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పి.గోవర్ధన్ తీర్పునిచ్చారు. జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో మరో 6 నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో వెల్లడించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.దేవానంద్ అందించిన వివరాలివీ.. నిందితుడు కె.తరుణ్‌ది ఒడిశా. వృత్తి రీత్యా లారీ డ్రైవర్. 2017 ఏప్రిల్ 19న మధ్యాహ్నం 12 గంటల సమయంలో చింతపల్లి నుంచి జి.కె.వీధి వైపు వస్తున్నాడు. ఆర్.వి.నగర్ జంక్షన్ దగ్గర ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ముగ్గురు వ్యక్తులు లారీకి అడ్డంగా వచ్చారు. వారిని తప్పించబోయి బైక్‌ని ఢీకొనడంతో ముగ్గురూ మృతి చెందారు. డ్రైవర్ తరుణ్ భయంతో కిందకు దూకడంతో.. లారీ దగ్గరలో ఉన్న ఇంటిని, దుకాణాన్ని ఢీకొట్టింది. ఆంజనేయస్వామి ఆలయం వరకు వచ్చి లారీ ఆగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. అప్పటి చింతపల్లి డీఎస్పీ అనిల్ కేసు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పు చెప్పారు.

కౌన్సిల్ ఆమోదం మేరకు జీతాల బిల్లు పెట్టాలి

- లేకపోతే నీటి సరఫరా విభాగం కార్మికులు సమ్మెకు వెళతారు
- జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ హెచ్చరిక

దాబాగార్డెన్స్: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) కౌన్సిల్ ఆమోదం మేరకు జీతాలు బిల్లు పెట్టాలని, లేకపోతే ఈ నెల 26 నుంచి నీటి సరఫరా విభాగం కార్మికులు సమ్మెకు వెళ్తారని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహదేవ్ ఆనందరావు హెచ్చరించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు జీవో 7 ప్రకారం జీతాల పెంపునకు కౌన్సిల్ ఆమోదం తెలపడం సంతోషంగా ఉందన్నారు. జీవో ప్రకారం పదేళ్ల అనుభవం ఉన్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.15,000 నుంచి రూ.18,500కు, ఐటీఐ అర్హత ఉన్నవారికి రూ.21,500కు వేతనం పెరగాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. డిసెంబర్ జీతాల బిల్లు ప్రాసెస్ 18న మొదలై 25 వరకు జరుగుతుందని, ఆ తర్వాత కమిషనర్ అనుమతితో జీతాలు విడుదల అవుతాయని గుర్తు చేశారు. ఈ మేరకు జీతాలు బిల్లు పెట్టకపోతే 26 నుంచి కార్మికులు సమ్మె చేస్తారన్నారు. 169 మంది కార్మికుల నియామకాల్లో అక్రమాలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై కమిటీ వేసి నిజనిర్ధారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు ఇ.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రెల్లి సత్యం, నిర్వాహక అధ్యక్షుడు ప్రసాద్, సంయుక్త కార్యదర్శి జీవన్ పాల్గొన్నారు.

జనవరి నెలాఖరుకు హెలికాప్టర్ మ్యూజియం


పనులను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ : బీచ్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న నేవల్ హెలికాప్టర్ మ్యూజియం జనవరి నెలాఖరు నాటికి అందుబాటులోకి వస్తుందని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ తెలిపారు. మంగళవారం హెలికాప్టర్ మ్యూజియం, మల్టీ లెవెల్ కార్‌పార్కింగ్ పనులను వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూహెచ్3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అలాగే సిరిపురం జంక్షన్‌లో నిర్మాణంలో ఉన్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ప్రాజెక్టు పనులను కూడా వేగంగా పూర్తి చేసి త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు సుధీర్, దుర్గాప్రసాద్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ కార్తీక్ పాల్గొన్నారు.

సహిత విద్య విజయవంతానికి కృషి


మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

విశాఖ విద్య : దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు దీనిలో భాగంగా అమలు చేస్తున్న సహిత విద్యను విజయవంతం చేయాలని ఆర్జేడీ విజయభాస్కర్, డీఈవో ప్రేమ్‌కుమార్ అన్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో సహిత విద్యపై హార్బర్ రోడ్‌లో గల ఏపీహెచ్‌ఆర్‌డీఐలో మంగళవారం ఒక్కరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖాధికారులు తమ పరిధిలో సహిత విద్యా కార్యక్రమాల అమలుపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ రకాల సదుపాయాలు అందుతున్నాయా లేదా అనేది ఎంఈవోలు పరిశీలన చేయాలన్నారు. భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించి అక్కడ జరుగుతున్న కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో దివ్యాంగుల నమోదు, పాఠశాలల్లో వారికి కల్పిస్తున్న సౌకర్యాలు, యు డైస్ ప్లస్ సర్వే వంటి అంశాలపై ఎంఈవోలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర స్థాయి అబ్జర్వర్లు వై.నరసింహం, అమ్మినాయుడు సమగ్ర శిక్ష రాష్ట్ర స్థాయిలో కల్పిస్తున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. ఏఎల్ఎస్‌సీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సహిత విద్య డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బి.గీత, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.